సాక్షి సూర్యాపేట

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయిని తరలిస్తున్న ముఠాను చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 2లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 51,235 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 51,235 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,029 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 9,166 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 600

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,617 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,706 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 170 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 243 క్యూసెక్కులు

వంటింట్లో ధరల మంట

ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల రేట్లు

- భారీగా పెరిగిన వంటనూనెల ధరలు
- లీటరుకు రూ.30 నుంచి రూ.40 వరకు పెరుగుదల
- పప్పులు, ఉల్లి, వెల్లుల్లి రేట్లదీ అదేపరిస్థితి
- పండుగల వేళ పేద, మధ్య తరగతి వర్గాలపై భారం



సూర్యాపేటటౌన్ : బతుకమ్మ , దసరా పండుగల వేళ నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. వారం పది రోజుల ముందు నుంచే పండుగ సామాను కొనుగోలుకు దుకాణాలకు వెళ్తున్న వినియోగదారులకు సరుకుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ధరలతో పేదలు, సామాన్యులపై పెనుభారం పడుతోంది. మంచి నూనె మొదలుకొని పప్పు, వెల్లుల్లి, ఉల్లిగడ్డ రేట్లు పైపైకి ఎగబాకాయి. వంటనూనెల ధరలు కనీసం ఒక్కో లీటర్ ప్యాకెట్‌పై సుమారు రూ.30 నుంచి రూ.40వరకు పెరిగింది. అన్ని రకాల వంట నూనెల ధరలు పెరగడంతో పిండి వంటలకు సిద్ధమవుతున్న గృహిణులకు షాక్ తగులుతోంది. బ్లాక్ దందాలు, ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన ప్రభుత్వం, సంబంధిత అధికారులు గాలికి వదిలేశారన్న విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

అడ్డగోలుగా ధరలు పెంచుతున్న వ్యాపారులు

పండుగ వేళ వ్యాపారులు నిత్యావసర సరుకుల ధరలను అడ్డగోలుగా ధరలు పెంచేస్తున్నారు. సన్‌ఫ్లవర్ ప్యాకెట్ రూ.110 నుంచి రూ.135 వరకు పెరిగింది. నువ్వులు, వేరు శనగ నూనెలు ఒక్కో ప్యాకెట్ రూ.30 చొప్పున పెరిగాయి. అలాగే పామాయిల్ ఒక్కో ప్యాకెట్ ధర రూ.35వరకు పెరిగింది. వీటితో పాటు కందిపప్పు, శనగపప్పు, మినపగుండ్లు, ఇతర నిత్యావసర ధరలు కూడా పెరిగాయి. గత నెలలో రూ.105 ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.135కు చేరింది. పామాయిల్ రేటు గత నెలలో రూ.87 ఉండగా ప్రస్తుతం రూ.125కు చేరింది. కందిపప్పు రూ.140 నుంచి రూ. 165కు ఎగబాకింది. రూ.85 ఉన్న కిలో శనగపప్పు ధర ప్రస్తుతం రూ.100కు చేరింది. దీంతో సామాన్య ప్రజలు పండుగ ముందు నిత్యావసర ధరలు కొనాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రూ.వెయ్యి పెడితే కనీసం సంచి నిండా సామాను రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు (రూ.లలో)ఇలా..	గత నెల	ప్రస్తుతం
సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్	105	135
పామాయిల్ లీటర్	85	125
పల్లీ నూనె లీటర్	145	155
కందిపప్పు కిలో	145	165
శనగపప్పు కిలో	85	100
వెల్లుల్లి	250	350

పెరగనున్న ఖర్చు..

దసరా పండుగ నేపథ్యంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు సద్దుల బతుకమ్మ నుంచి దసరా ముగిసిన రెండు రోజుల వరకు ఇళ్లలో పిండి వంటలతో పాటు మటన్, చికెన్ ఇలా ఇష్టాన్ని బట్టి రకరకాల వంటకాలు తయారు చేసుకుంటారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు తమ ఆర్థిక పరిస్థితులను బట్టి ఖర్చు చేస్తుంటారు. ప్రస్తుతం క్వాలిటీని బట్టి లీటర్ వంట నూనెను రూ.35వరకు, పదిహేను లీటర్ల టిన్‌కు రూ.350వరకు ధరలు పెరిగాయి. అలాగే పప్పుల ధరలు సైతం అదే స్థాయిలో ఉన్నాయి. పెరిగిన నూనె, కిరాణా సరుకుల ధరలతో ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు అదనంగా ఖర్చు పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో 8లక్షలకు పైగా జనాభా ఉండగా సుమారు 3లక్షల కుటుంబాలు వరకు ఉంటాయి. దసరా పండుగ నేపథ్యంలో సుమారు రూ.200కోట్ల కు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉంటుంది. ధరల పెరుగుదల పేద, మధ్య తరగతి కుటుంబాల కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపనుంది.

రేట్లు పెరిగినా కొనుగోలుచేయక తప్పదు



నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి భారంగా మారినా కొనుగోలు చేయక తప్పడం లేదు. పండుగ వేళ అన్ని సరుకుల ధరలు విపరీతంగా పెంచారు. పిండి వంటలు చేసేందుకు పామాయిల్ కొనాలంటే రూ.125పైగా చెబుతున్నారు. దీంతో పిండి వంటలు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు.

– లక్ష్మి, సూర్యానాయక్‌తండా

ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నాం



పండుగ వచ్చిందంటే చాలు నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. దుకాణానికి వెళ్లి సరుకులు కొనుగోలు చేయాలంటే భయమేస్తుంది. అందుకే గతంలో ముందుగానే సరుకులు కొనేవాళ్లం. కానీ ఈ సారి ముందస్తుగానే ధరలు పెంచడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– శ్రావణి, సూర్యాపేట

పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

హుజూర్‌నగర్ : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం హుజూర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చాంబర్‌లో మున్సిపాలిటీలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్‌ని అడిగి వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ విలేఖరులతో మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ సర్వే పైలెట్ ప్రాజెక్టు కింద 5 బృందాలతో హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో 381 గృహాల్లో సర్వే నిర్వహించారని ఆ వివరాలను ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి సమస్య ఉంటే మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తెచ్చి ఎక్కువ నీరు సరఫరా చేసేలా చూసుకోవాలన్నారు. పట్టణంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నిరంతరం శానిటేషన్, ఫాగింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేయటంలో చాలా వెనుకంజలో ఉన్నారని దీనిని వేగిరం చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు.



హుజూర్‌నగర్: కంప్యూటర్‌లో సర్వే నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



ఆదర్శకాలనీ వద్ద ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్ ఆదేశించారు. హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట సమీపంలో ఆదర్శ కాలనీ వద్ద ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అవసరం అయితే ఎక్కువ మంది కూలీలను ఏర్పాటు చేసుకొని అక్టోబర్ చివరి నాటికి స్లాబులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా, డీటీ నాగరాజు, ఏఈ వినోద్ కుమార్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆర్ఐ సాయి రెడ్డి, హౌసింగ్ డీఈ జబ్బార్ అహ్మద్, ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలి



ఉపాధి హామీ కార్యాలయంలో పనుల వివరాలు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ అప్పారావు

పెన్‌పహాడ్: ఉపాధిహామీ పనుల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించుకొని వాటిని త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఓ అప్పారావు సూచించారు.మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో నీటి కుంటలు, చెరువులు, కాల్వల పూడిక తీత పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. న్యూ ఎంటర్ ప్రైజెస్ పథకం కింద మండల కేంద్రంలో సుహాసిని ఎంబ్రాయిడింగ్ మిషన్ ఏర్పాటు చేసుకోగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఎం అజయ్‌నాయక్, ఏపీఓ రవి, ఈసీ మహేష్, టీఏ ఏకస్వామి, రాంకుమార్, బుచ్చన్న పాల్గొన్నారు.

డీఎస్సీ 2024 ఎంపిక పూర్తి

386 పోస్టులకు 332 భర్తీ

- ఎంపిక జాబితా విడుదల
- నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేత
- ప్రతి నియోజకవర్గం నుంచి స్పెషల్ బస్సులు
- ఎనిమిది బస్సుల్లో తరలివెళ్లనున్న అభ్యర్థులు



స్కూల్ అసిస్టెంట్లు	83
లాంగ్వేజ్ పండిట్లు	22
పీఈటీలు	05
ఎస్‌జీటీలు	222

సూర్యాపేటటౌన్ : డీఎస్సీ 2024 ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. మొదట డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేశారు. ఆతర్వాత 1:1నిష్పత్తిలో కేటగిరీల వారీగా 332 పోస్టులకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేసి మంగళవారం జాబితా విడుదల చేశారు. ఎంపికైన వారికి బుధవారం హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈనేపథ్యంలో వీరిని తరలించేందుకు ఎనిమిది బస్సులను సిద్ధం చేశారు.

48పోస్టులు పెండింగ్

జిల్లాలో మొత్తం 386 ఖాళీలు నింపేందుకు అధికారులు కసరత్తు చేశారు. అయితే అందులో 48 స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధించి కోర్టు కేసుల కారణంగా ఫలితాలు వెల్లడించలేదు. మిగతా 332 మందిని ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు అధికారులు జాబితా విడుదల చేశారు. ఇందులో లాంగ్వేజ్ పండిట్ 22, పీఈటీలు ఐదుగురు, ఎస్‌జీటీలు 222, స్కూల్ అసిస్టెంట్‌లు 83 మంది ఎంపికయ్యారు. వీరందరికీ బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు.

ఉదయం 6గంటల వరకే బస్సు వద్దకు చేరుకోవాలి: అశోక్, డీఈఓ

డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయుడిగా ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 6గంటల వరకు ఆయా నియోజకవర్గాల్లో కేటాయించిన బస్సుల వద్దకు చేరుకోవాలి. సూర్యాపేట నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల జెడ్పీ కార్యాలయం వద్ద, కోదాడలోని జెడ్పీ బాలుర పాఠశాల వద్ద, హుజుర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద, తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలమగిరి ఎక్స్ రోడ్డు వద్ద బస్సులు సిద్ధంగా ఉంటాయి. అభ్యర్థులు సమయానికి రావాలి.

ప్రతి నియోజకవర్గం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

డీఎస్సీలో ప్రతిభ చాటి ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులను బుధవారం హైదరాబాద్‌కు తరలించేందుకు అధికారులు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. డీఈఓ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రతి నియోజకవర్గానికి బస్సులు ఏర్పాటు చేశారు. ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఉదయం నుంచే ఫోన్‌లు చేసి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు రావాల్సిందిగా సమాచారం ఇచ్చారు. ఎంపికైన వారికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. సూర్యాపేట నియోజకవర్గం నుంచి మూడు బస్సుల్లో 141 మంది అభ్యర్థులు, హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి రెండు బస్సుల్లో 62 మంది, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించి తిరుమలగిరి నుంచి ఒక బస్సులో 23 మంది, కోదాడ నియోజకర్గం నుంచి 96 మంది అభ్యర్థులకు రెండు బస్సులను ఏర్పాటు చేశారు. మొత్తం 332 మంది ఎంపికైన ఉపాధ్యాయులను ఎనిమిది బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించనున్నారు.

న్యూస్‌రీల్

నిబంధనల ప్రకారం ఓటరు జాబితా రూపకల్పన

భానుపురి (సూర్యాపేట) : నిబంధనల ప్రకారం టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పన చేస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పన పై కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత తో కలిసి పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సూర్యాపేట, హుజూర్‌నగర్ ఆర్డీఓ అధికారులు వేణుమాధవ్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు, తహసీల్దార్లు పాల్గొన్నారు

అసిస్టెంట్ సెషన్స్‌కోర్టు అదనపు పీపీగా లక్ష్మణ్



అదనపు పీపీకి స్వాగతం పలుకుతున్న ఏపీపీలు

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అదనపు పీపీగా కె. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఈయన హైదరాబాద్‌లోని నాంపల్లి సీఐడీ కోర్టు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అఖిల పదోన్నతిపై నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పీపీలు బి.హేమలత, వై.శ్రీపాల్ రెడ్డి, ఏజీపీ కోణం రఘురామయ్య ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న మోదీ

మోతె: భారతదేశ సంపదను నేడు మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మోతె మండల పరిధిలోని రావిపహాడ్‌లో 8వ మండల మహా సభలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం ఎక్కువై యువత ఉపాధి లేక మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా మంజూరు చేయాలన్నారు. ఈ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, మండల కార్యదర్శి ముల్కూర్ గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు గుంటగాని ఏసు, కిన్నెర పోతయ్య, కాంపాటి శ్రీను, కొక్కరేణి సత్యనారాయణ, నాగం మలయ్య, సోమగాని మల్లయ్య, స్వరాజ్యం, ఎర్రబోయిన మల్సూర్, దోసపాటి శ్రీను, బత్తిని వెంకటేశం, కోడి లింగయ్య, గడ్డం మల్లయ్య పాల్గొన్నారు.



రావిపహాడ్‌లో మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


సైదులు (ఫైల్)

నేరేడుచర్ల: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం నేరేడుచర్లలో జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతబండకు చెందిన యడ్ల సైదులు(44), అతడి భార్య జానకమ్మకు మధ్య కుటుంబ నిర్వహణ, ఖర్చుల విషయంలో గొడవ జరగగా.. ఈ నెల 2వ తేదీన జానకమ్మ చింతబండ సమీపంలో ఉంటున్న తన అన్న దాసరి సైదులు ఇంటికి వెళ్లింది. భార్య వెళ్లిపోవడం, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయిన సైదులు సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. సైదులు కుమారుడు ప్రవీణ్ గమనించి అతడిని కిందకు దించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి 108 వాహనంలో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే సైదులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వైన్స్‌లో చోరీ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని సునీతా వైన్స్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వైన్స్ పైకప్పు రేకులు తొలగించి లోపలికి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాల కనెక్షన్ తీసి వేసి రూ.27వేల నగదుతో పాటు 10 మద్యం బాటిళ్లు(ఒక్కోటి రెండు లీటర్లు) ఎత్తుకెళ్లారు. మంగళవారం వైన్స్ యజమాని దబ్బెటి రమేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

లారీ కింద పడి యువకుడికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: లారీ కింద పడి యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌కు చెందిన కేశబోయిన అఖిలేష్(23), మరో నలుగురు యువకులు కలిసి దుర్గామాత నిమజ్జనానికి లారీని తీసుకెళ్లేందుకు పంతంగి టోల్ ప్లాజా వద్దకు మంగళవారం ఉదయం వచ్చారు. టోల్‌ప్లాజా నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ లారీని ఆపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ ఆపకుండా ముందుకెళ్లడంతో అఖిలేష్ లారీ కిందపడగా.. అతడి కాలు పైనుంచి లారీ టైరు ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని టోల్ ప్లాజా అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి సోదరుడి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెన్‌పహాడ్: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పెన్‌పహాడ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండల పరిధిలోని నూర్జహాన్‌పేట గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. చివ్వెంల మండలం రాంకోటితండాకు చెందిన ధరావత్ లింగ, పెన్‌పహాడ్ మండలం మోర్సకుంటతండాకు చెందిన అతడి బావమరిది బాణోతు శ్రీను ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ధరావత్ లింగ, బాణోతు శ్రీనుపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

- 54 కేజీల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- కేసు నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

చౌటుప్పల్ రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి మహారాష్ట్రలోని పూణెకు గంజాయిని తరలిస్తున్న ముఠాను చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద ఎస్ఓటీ పోలీసులు, చౌటుప్పల్ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా చందవాడ తాలూకా దూగావ్ గ్రామానికి చెందిన ప్రకాష్ జానేశ్వర్ తన బంధువులైన హమ్మద్‌నగర్ జిల్లా దంగేవాస్తి షిర్డి గ్రామానికి చెందిన నవనాథ్ బాబస్ మోహితే, పూణె జిల్లా షిరూర్ తాలూకా రాజంగావ్‌గణపతికి చెందిన ధర్మ అప్రోబా తువార్‌తో కలిసి ముఠాగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ప్రాంతంలో కిలో గంజాయిని రూ.3వేలకు కొనుగోలు చేసి పూణెలోని దళారులకు రూ.8వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం వారు అరకు నుంచి కారులో గంజాయి తీసుకుని హైదరాబాద్ మీదుగా పూణెకు వెళ్తుండగా.. పక్కా సమాచారం మేరకు భువనగిరి ఎస్ఓటీ పోలీసులు, చౌటుప్పల్ పోలీసులు రాత్రి పంతంగి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. కారులో సీట్ల కింద గంజాయిని ప్యాకెట్ల రూపంలో పెట్టి రహస్యంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి నుంచి 54 కేజీల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

మిర్యాలగూడ అర్బన్: పసికందు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు మంగళవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన మౌనికను డెలివరీ కోసం కుటుంబ సభ్యులు ఆదివారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచిన డాక్టర్లు నెలలు నిండినా కూడా నొప్పులు రాకపోవడంతో మంగళవారం ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలోనే పసికందు మృతి చెందింది. ఆస్పత్రిలో అడ్మిట్ అయినప్పుడు అంతా బాగానే ఉందని చెప్పిన వైద్యులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా హడావుడిగా ఆపరేషన్ చేశారని మౌనిక కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృతి చెందిందని ఆరోపించారు. డెలివరీ సమయంలో పసికందు మృతిచెందడంలో తమ నిర్లక్ష్యం ఏమాత్రం లేదని ఏరియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించామని, బేబీ హార్ట్‌బీట్ తక్కువగా ఉండటాన్ని రిపోర్టులో గుర్తించి ఆపరేషన్ చేశామని పేర్కొన్నారు. అప్పటికే ఉమ్మనీరు మింగటం వల్లనే బేబీ మృతి చెందినట్లు వివరించారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడు.. తల్లిదండ్రుల చెంతకు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

భువనగిరి క్రైం: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి భువనగిరి బస్టాండ్‌లో తిరుగుతున్న బాలుడిని బాలల హక్కుల కార్యకర్త కొడారి వెంకటేశ్ సహాయంతో పోలీసులు అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మల్కాపురం బద్దుతండాకు చెందిన గుగులోతు అనూష, మధు కొంతకాలంగా భువనగిరి పట్టణంలోని ఖిలానగర్‌లో అద్దెకు ఉంటూ పూల వ్యాపారం చేస్తున్నారు. వీరి కుమారుడు ధనుష్(3)ను మంగళవారం మధ్యాహ్నం అనూష అత్తగారికి అప్పజెప్పి పూలు అమ్ముకుంటున్నారు. ధనుష్ తన నానమ్మ దగ్గరి నుంచి తప్పిపోయి భువనగిరి బస్టాండ్‌లో తిరుగుతుండగా బాలల హక్కుల కార్యకర్త కొడారి వెంకటేశ్ గుర్తించి బాలుడిని పోలీసులకు అప్పగించారు. బాలుడికి మాటలు రాకపోవడంతో బాల సదనంకు పంపించాలని నిర్ణయం తీసుకుని సీఐ జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులుకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే ధనుష్‌ను వెతుక్కుంటూ అతడి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు రావడంతో వారికి బాలుడిని అప్పగించారు.

ఇంటి నుంచి వెళ్లిపోయి శవమై తేలాడు

మిర్యాలగూడ అర్బన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి రిజర్వాయర్‌లో శవమై తేలాడు. మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన మోతాల నర్సింహ (50) మద్యం మత్తులో కుటుంబ సభ్యులపై అలిగి ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదే రోజు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పానుగోడు రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. మిర్యాలగూడ పోలీసులు పరిశీలించి నర్సింహ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి ఫొటోలను చూపించగా అతడి కుమారుడు సంకేత్ నర్సింహ మృతదేహంగా గుర్తించాడు. దీంతో మిర్యాలగూడ పోలీసులు గరిడేపల్లి పోలీసుల నుంచి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

కాల్వలో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

వేములపల్లి: మండల పరిధిలోని రావులపెంట సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో పడి గల్లంతైన మహిళ మృతదేహం గరిడేపల్లి మండలం పానుగోడు రిజర్వాయర్‌లో మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని రావువారిగూడెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పేరబోయిన అనూష (35) కామేపల్లిగూడెంలో ఇన్‌చార్జి అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 5వ తేదీన విధులు ముగించుకుని తన భర్త సైదులుతో కలిసి బైక్‌పై నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్ట మీదుగా ఇంటికి వెళ్తుండగా.. రావులపెంట సమీపంలో భార్యాభర్తలిద్దరూ బైక్‌తో సహా కాల్వలో పడిపోయారు. సైదులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరగా.. అనూష కాల్వలో గల్లంతైంది. అనూష ఆచూకీ కోసం పోలీసులు కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం గరిడేపల్లి మండలం పానుగోడు రిజర్వాయర్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలి


ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న సూర్యాపేట జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి జానయ్య

పెన్‌పహాడ్: ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్‌ను సాగు చేసినట్లయితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని సూర్యాపేట జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామంలోని తీకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోట నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభవుతుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిని కట్ల స్వాతి, సూపరింటెండెంట్ నరహరి, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ జాన హరీష్‌గౌడ్, జూనియర్ మేనేజర్ వి. శశికుమార్, క్షేత్ర సహాయకులు భద్రాచలం, వి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం


శ్రీకాంత్ (ఫైల్)

త్రిపురారం: ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన గొడవలతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిడమనూరు మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన పాల్వాయి శ్రీకాంత్ డీఆర్‌డీఓలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేస్తున్నాడు. మంగళవారం తన ఇంట్లో పైన గదిలోకి వెళ్లి శ్రీకాంత్ ఎంతకూ కిందకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఫోన్ ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు పైకి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. కొంతకాలంగా ఇతర ఉద్యోగుల విషయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


కృష్ణ (ఫైల్)

మద్దిరాల: విద్యుదాఘాతంతో యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన మద్దిరాల మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన భూతం కృష్ణ(25) మంగళవారం తన వ్యవసాయ భూమిలో వరి పొలం కోయిస్తుండగా.. హార్వెస్టర్‌కు విద్యుత్ వైర్లు తగలకుండా వాటిని సరిచేస్తుండగా అతడి ఎడమ చేతికి విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎం. వీరన్న తెలిపారు.

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

సూర్యాపేటటౌన్: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతలచెరువు శేఖర్ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద తనకు పరిచయం ఉన్న మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అక్కడే ఉన్న సదరు మహిళ బంధువులు వెంటనే శేఖర్‌ను పట్టుకొని చితకబాదారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళ బంధువులను, శేఖర్‌ను స్టేషన్‌కు తరలించారు. శేఖర్‌పై, మహిళ బంధువులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

అక్కాచెల్లెళ్ల డబుల్ ధమాకా

- ఒక్కొక్కరికి రెండేసి ప్రభుత్వ ఉద్యోగాలు


పందిరి తేజస్విని, ప్రియాంక

కోదాడ: ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కష్టతరమవుతున్న ఈ రోజుల్లో చిలుకూరు మండలం జెర్రిపోతులగూడేనికి చెందిన అక్కాచెల్లెళ్లు రెండేసి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు పొందుతున్నారు. జెర్రిపోతులగూడేనికి చెందిన పందిరి అమృతారెడ్డి–లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె లంకెల తేజస్విని ఇంజనీరింగ్ పూర్తిచేసి 2020లో జైలు వార్డర్‌గా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఆమె ఖమ్మం జిల్లా జైలులో పనిచేస్తూ.. 2024 డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనపరిచి మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన నూతన ప్రభుత్వ ఉపాధ్యాయుల జాబితాలో ఎస్‌జీటీగా ఎంపికైంది. ఈమె చెల్లెలు ప్రియాంక 2023లో సివిల్ ఎస్ఐగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం ప్రొబేషనరీ ఎస్ఐగా చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో కూడా ప్రియాంక మంచి ర్యాంక్ సాధించింది. అక్కాచెల్లెళ్లిద్దరూ గ్రూప్–1 ఉద్యోగం సాధించడమే తమ లక్ష్యమని, తమ విజయంలో కుటుంబ సభ్యులు అందించిన సహకారం మరువలేనిదని చెబుతున్నారు.

ఆ కుటుంబంలో ముగ్గురూ ఇంగ్లిష్ టీచర్లే

- డీఎస్సీ ఫలితాల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో సూర్యాపేట జిల్లాలోనే ప్రథమ స్థానం


ఇంగ్లిష్ పీజీటీగా నియామక పత్రం అందుకుంటున్న శరత్, తల్లిదండ్రులు (ఫైల్)

సూర్యాపేట: ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో సూర్యాపేట పట్టణానికి చెందిన దంతాల శరత్ ఇంగ్లిష్(స్కూల్ అసిస్టెంట్) సబ్జెక్ట్‌లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈయన ఇప్పటికే టీజీటీ, పీజీటీ, ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం నాగారం బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఇంగ్లిష్ పీజీటీగా పనిచేస్తున్నాడు. ఈయన తల్లిదండ్రులు దంతాల సంధ్యారాణి పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లిష్(స్కూల్ అసిస్టెంట్) టీచర్‌గా పనిచేస్తుండగా, తండ్రి దంతాల ప్రభాకర్ చివ్వెంల మండలం చందుపట్ల హైస్కూల్‌లో ఇంగ్లిష్(స్కూల్ అసిస్టెంట్) టీచర్‌గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దంతాల శరత్‌ను తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సోదరిని స్ఫూర్తిగా తీసుకున్న సోదరుడు

- స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన పాలడుగు వాసి
- ఫిజికల్ సైన్స్‌లో యాదాద్రి జిల్లా మొదటి ర్యాంకు


గొర్ల నరేందర్

మోత్కూరు: మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన గొర్ల నరేందర్ డీఎస్సీ–2024 ఫలితాల్లో ఫిజికల్ సైన్స్ సబ్జెక్ట్(స్కూల్ అసిస్టెంట్)లో యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బుధవారం సీఎం చేతులమీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకోవడానికి హాజరుకావాలని ఆయనకు మంగళవారం డీఈఓ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. ఓపెన్ కేటగిరీలో ఉన్న ఒకే ఒక్క ఉద్యోగాన్ని తాను సాధించడం ఆనందంగా ఉందని నరేందర్ తెలిపారు. తన సోదరి ప్రమీల ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ (సోషల్ సబ్జెక్ట్)గా విధులు నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఒకేసారి టీచర్లుగా ఎంపికైన భార్యభర్తలు


వంశీరెడ్డి, గౌతమి దంపతులు

నడిగూడెం: నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి కొణతం వంశీరెడ్డి, కొంపెల్లి గౌతమి దంపతులు డీఎస్సీ–2024 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కొణతం వంశీరెడ్డి సూర్యాపేట జిల్లా స్థాయిలో 7వ ర్యాంకుతో ఎస్‌జీటీగా ఎంపికయ్యారు. ఆయన భార్య అయిన కొంపెల్లి గౌతమి మహబూబాబాద్ జిల్లా స్థానికతతో 291వ ర్యాంకు సాధించి ఎస్‌జీటీ ఉద్యోగానికి ఎంపికైంది. వంశీరెడ్డి, గౌతమి దంపతులను గ్రామస్తులు అభినందించారు.

శ్రీపర్వతవర్ధినిగా ముస్తాబైన దుర్గామాత


పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం 6వ రోజు అమ్మవారిని శ్రీపర్వతవర్ధిని దేవిగా అర్చకులు అలంకరించారు. అనంతరం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణములు, గాయత్రీ జపములు, లలిత సహస్రనామార్చన వంటి పూజలు చేపట్టారు. 12గంటల నుంచి మధ్యాహ్నపూజ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణ జరిపించారు. సాయంకాలం శ్రీదేవి నవావరణ పూజ, సహస్రనామార్చన, నీరాజనం మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ పూజలను వైభవంగా అర్చకులు నిర్వహించారు.

యాదాద్రిలో పర్యటించిన మధ్యప్రదేశ్ బృందం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్ర పీడబ్ల్యూడీ చీఫ్ ఇంజనీర్లు సురేష్ చంద్ర వర్మ, రాంలాల్ వర్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంతోపాటు, యాదాద్రి కొండకు దిగువన జరిగిన అభివృద్ధి పనులు, రాయగిరి నుంచి యాదగిరిగుట్ట ప్రధాన రహదారి, యాదాద్రి ప్రధానాలయ నిర్మాణం, ప్రెసిడెన్షియల్ సూట్, విల్లాలు, కల్యాణకట్ట, రింగ్‌రోడ్డు, వ్రత మండపాలను పరిశీలించారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో యాదాద్రిలో పీడబ్ల్యూడీ చీఫ్ ఇంజనీర్ల బృందం పరిశీలించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వారి వెంట తెలంగాణ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ సీఈ పుల్లాదాసు, ఎస్ఈ వసంత్‌నాయక్, ఈఈలు బాల ప్రసాద్, డీఈలు బిల్యా నాయక్, ఏఈఈ శ్రీనివాస్, కరుణాకర్, భరత్‌తదితరులున్నారు.

ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థుల నైపుణ్యం మెరుగుపడుతుంది

గరిడేపల్లి: ఇంటర్న్‌షిప్‌లతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగవుతాయని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ అన్నారు. గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులో అగ్రికల్చర్ ట్రేడ్‌కు సంబంధించి 10రోజుల ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మంగళవారం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ విద్యార్థులకు జీవ ఎరువులు, వర్మీ కంపోస్టు తయారీ, డ్రిప్పు, స్ప్రింక్లర్లు ద్వారా నీటిని ఆదా చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ కోఆర్డినేటర్స్ బి. చంద్రశేఖర్, ఎస్. రాజు, ఒకేషనల్ టీచర్ టి. శ్రీను పాల్గొన్నారు.


విద్యార్థులకు జీవ ఎరువుల వాడకాన్ని వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

2018లోనే ఆలేరుకు గోదావరి జలాలు

యాదగిరిగుట్ట: ఆలేరు నియోజకవర్గానికి 2018లోనే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందించామని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలో రైతులంతా సంతోషంగా ఉన్నారంటే అది కేసీఆర్ పుణ్యమేనన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తామే నీళ్లు అందిస్తున్నామని చెప్పుకోవడం బాధాకరమన్నారు. జే.చొక్కారావు గోదావరి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించి, మెయిన్ రైట్ కెనాల్ ద్వారా నవాబ్‌పేట రిజర్వాయర్‌కు ఎల్2, ఎల్6 ద్వారా 0.47 టీఎంసీల నీరు, 2019లో గుండాల మండలానికి 36 చెరువుల ద్వారా 17,680 ఎకరాలకు సాగు నీరు అందించినట్లు తెలిపారు. కొండపోచమ్మ రిజర్వాయర్ ప్యాకేజీ 14 ద్వారా తుర్కపల్లి మెయిన్ కెనాల్ నుంచి బొమ్మలరామారం, తుర్కపల్లికి నీళ్లు అందించామన్నారు. దేవాదుల నీరు కింది భాగానికి రాకుండా అడ్డుకుంటే కొన్నె చెరువు ద్వారా 2018 నుంచి బొందుగుల చెరువును నింపుకుంటున్నట్లు వెల్లడించారు. పెద్ద రాంచర్ల నుంచి రాఘవపురం చెరువు ద్వారా ఆలేరు పెద్ద వాగులో గోదావరి జలాలు పారించామన్నారు. ప్యాకేజీ 15 ద్వారా గంధమల్ల చెరువు నింపి మల్లాపురం, సైదాపురంతో పాటు యాదగిరిగుట్ట మండలంలో అనేక చెరువులను నింపామన్నారు. ప్యాకేజీ 16 ద్వారా నృసింహసాగర్ ద్వారా కాల్వలు తవ్వించి యాదగిరిగుట్టలోని గండి చెరువులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 26 చెక్ డ్యామ్‌లు నిర్మించామని, 23 చెక్ డ్యామ్‌లను పునర్నిర్మాణం చేసినట్లు తెలిపారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం


గౌరాయపల్లిలోని చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, చిత్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట రూరల్: మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి, సాధువెల్లి, కాచారం గ్రామాల్లోని చెరువుల్లో కలెక్టర్ హనుమంతు కె. జెండగేతో కలిసి చేపపిల్లలను విడుదల చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. మత్స్యకారులు, ముదిరాజులు ఆర్థికంగా ఎదిగేందుకు వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం చేప పిల్లలు అందిస్తుందని తెలిపారు. జిల్లాలో సుమారుగా ఉన్న 780 చెరువులను నింపి, రూ.కోటి 30 లక్షలు వెచ్చించి చేప పిల్లలను పెంచే ప్రక్రియ చేపట్టిందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మిగిలిన చెరువులను కూడా నింపే బాధ్యత తీసుకుంటామన్నారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించి, 5 లక్షల ప్రమాద బీమా ఇచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు సంజయ్, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు కృష్ణ, ఝాన్సి, రవిశంకర్, సతీష్, శంకరయ్య , కుమార్, నరసింహ, ఎంపీడీఓ నవీన్ కుమార్, ఎంపీఓ సలీమ్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.